క్లుప్తంగా

వైభవోపేతంగా నగర సంకీర్తన

గురజాల : రథసప్తమిని పురస్కరించుకుని పట్టణంలో వేంచేసియున్న మహిమానిత్వ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో నగర సంకీర్తన వైభవోపేతంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద నుంచి శివదీక్ష స్వాములు పార్వతి పరమేశ్వరుల చిత్రపటంతో నగర సంకీర్తనలో పాల్గొన్నారు. మహిళలు స్వామి వారి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సద్ది కమిటీ సభ్యులు శివస్వాములు తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పట్టణంలోని లెలిన్ నగర్ ప్రాంతంలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని శుక్రవారం పట్టణ విద్యుత్ శాఖ ఏఈ శివ నాగిరెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మతులలో భాగంగా ఈ అంతరాయం కలుగుతుందన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మాచవరం ఎంపీడీవోగా సురేష్

మాచవరం: మాచవరం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా బి.సురేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న వరప్రసాద్ ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈవోపీఆర్డీగా పని చేస్తున్న వెంకగళరావును ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. ఎన్నికల నిబంధనల మేరకు అధికారుల ఆదేశాలతో ప్రకాశం జిల్లా పామూరు ఎంపీడీవోగా పనిచేస్తున్న సురేష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు శుభాభినందనలు తెలియజేశారు.

ముస్లింల పురోగతిపై రేపు బహిరంగ సభ

పిడుగురాళ్ల: ముస్లింల పురోగతిపై ఈ నెల 18న పట్టణ జానపాడురోడ్డులోని ఏడు కొట్ల సెంటర్లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు అంజుమన్ కమిటీ కార్యదర్శి షేక్ మస్తాన్ వలి శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీస్ మెసేజ్ ఫౌండేషన్ ఫౌండర్ బ్రదర్ సిరాజ్ హాజరై ప్రసంగించనున్నారు. ముస్లింల పురోగతి ఎప్పుడు.. ఎలా.. అనే అంశంపై సిరాజ్ ఈ బహిరంగ సభలో ప్రసంగించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు సభ ప్రారంభం అవుతుంది. కావున గురజాల నియోజకవర్గంలోని ప్రజలందరు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై కేసు నమోదు

పిడుగురాళ్ల: మహిళను కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ శుక్రవారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్ల పట్టణానికి చెందిన చడపంగు అరుణ మాదిగ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా విభాగంలో కో కన్వీనర్‌గా పని చేస్తుంది. మండలంలోని పాత గణేశునిపాడు గ్రామానికి చెందిన మేకల సురేష్ తరచూ స్థానిక ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో, ఫేస్‌బుక్‌లో కించపరిచే విధంగా కామెంట్లు పెడుతున్నాడు. దానికి అరుణతో పాటు మరి కొందరు సురేష్ పెట్టే కామెంట్లను ఖండిస్తూ రిటన్ కామెంట్లను సోషల్ మీడియాలో పెట్టడంతో సురేష్ ఆగ్రహంతో గురువారం రాత్రి అరుణ వద్దకు వచ్చి అసభ్యకరమైన పదజాలంతో దూషించి, కులం పేరుతో కూడా దూషించడంతో ఆమె పిడుగురాళ్ల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అరుణ ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్ పేర్కొన్నారు.

నేడు గ్రామ వలంటీర్లకు అవార్డుల ప్రదానం

సత్తెనపల్లి: మండలంలోని గ్రామ వలంటీర్లకు శనివారం సాయంత్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో అవార్డులు ప్రదానం జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.జగదీష్ శుక్రవారం తెలిపారు. మండలంలో ఐదుగురికి సేవా రత్న, 388 మందికి సేవా మిత్ర అవార్డులను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎంపీపీ యలవర్తిపాటి షేక్ జైభూన్ బీ, జెడ్పీటీసీ సంకటి నాగేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

వ్యాపారాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ లైసెన్సులు తీసుకోవాలి

సత్తెనపల్లి: ఆంధ్రప్రదేశ్ దుకాణ సంస్థల చట్టం ప్రకారం అన్ని వ్యాపార సంస్థల యజమానులు ఈ నెల 29లోపు కార్మిక శాఖలో రిజిస్ట్రేషన్, రెన్యువల్ లైసెన్సులు తీసుకోవాలని సత్తెనపల్లి సహాయ కార్మిక శాఖ అధికారి వి.అన్నపూర్ణ చెప్పారు. పట్టణంలోని తన కార్యాలయంలో శుక్రవారం వ్యాపార సంస్థల యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. లైసెన్స్ పొందిన వారు తక్షణమే రెన్యువల్ చేసుకోవాలన్నారు. వ్యాపార సంస్థల యజమానులకు పలు సూచనలు చేశారు.

విద్యుత్ సమస్యలకు చెక్

నాడు

విద్యుత్ సమస్యలపై ఎమ్మెల్యే కాసు దృష్టికి.. మాచవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మాచవరం, గంగిరెడ్డిపాలెం, కొత్తపాలెం, తురకపాలెం, వేమవరం, చెన్నాయపాలెం, రేగులగడ్డ గ్రామాలకు విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుంది. మారుమూల గ్రామాలైన చెన్నాయపాలెం, రేగులగడ్డ, వేమవరం గ్రామాలకు విద్యుత్ సరఫరాకు నిరంతరం అంతరాయం కలుగుతుండేది. సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ కనెక్షన్లు అధికం కావడంతో విద్యుత్ సరఫరా కష్టతరంగా ఉండేది. విద్యుత్ అంతరాయంతో కొన్ని సార్లు గ్రామాలు అంధకారంలో ఉన్న పరిస్థితులు ఉన్నాయి. అలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నాడు గురజాల సమన్వయకర్తగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేపట్టిన అదేబాట, పొలంబాట, గడప గడపకూ వైఎస్సార్ లాంటి కార్యక్రమాల్లో ఆయా గ్రామస్తులు, నాయకులు విద్యుత్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చెన్నాయపాలెం గ్రామ పరిధిలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం చేపట్టాలని కోరారు. అధికారంలోకి వచ్చిన అనతి కాలంలోనే సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నేడు

విద్యుత్ సమస్యలకు పరిష్కారం.. ఇచ్చిన మాట ప్రకారం సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.50 కోట్ల నిధులు మంజూరు చేసి 05-05-2022న శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు చేపట్టి ఏడాదిన్నర కాలంలోనే పనులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా చేసే విధంగా కృషి చేశారు. అనతి కాలంలోనే నిర్మాణం పూర్తి చేసేందుకు కృషి చేసిన గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పనితీరును ఆయా గ్రామాల ప్రజలు ప్రశంసిస్తున్నారు.



విద్యుత్ సబ్‌స్టేషన్



ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)



చెన్నాయపాలెంలో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్



- విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణంతో మూడు గ్రామాలకు విద్యుత్ సరఫరా
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కృషితో తీరిన విద్యుత్ కష్టాలు

మాచవరం: మాట ఇచ్చారంటే చేస్తారంతే.. అనేది వైఎస్సార్‌సీపీ నినాదంగా మారింది. గత ఎన్నికల సందర్భంగా విద్యుత్ సమస్యలపై ఇచ్చిన మాట ప్రకారం మండలానికి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించి అనతి కాలంలోనే పూర్తి చేసి వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే చెందుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇది కాదా అభివృద్ధి అంటూ విమర్శలకు సమాధానమిస్తున్నారు.

సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ వినియోగం కింది విధంగా ఉంది..

గ్రామం	వ్యవసాయ కనెక్షన్లు	గృహ కనెక్షన్లు
వేమవరం	850	1500
చెన్నాయపాలెం	305	710
రేగులగడ్డ	65	200

50 ఏళ్ల వరకు ఇబ్బందులు లేవు..

సబ్‌స్టేషన్ నిర్మాణం వలన విద్యుత్ కష్టాలు తప్పాయి. గతంలో విద్యుత్ సరఫరాతో గ్రామస్తులు అల్లాడిపోయేవారు. నేడు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుంది. మరో 50 ఏళ్ల వరకు విద్యుత్ సమస్య ఉండదు.

– శానంపూడి వీరారెడ్డి , వేమవరం

ఎమ్మెల్యే కాసు కృషితోనే సాధ్యపడింది..

గత ఎన్నికల సమయంలలో విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. ఇచ్చిన హామీని సకాలంలోనే నెరవేర్చి మాట నిలబెట్టుకున్నారు. గ్రామ ప్రజలు ఆయనకు రుణపడి ఉంటారు.

– వట్టి రామిరెడ్డి, చెన్నాయపాలెం

మా గ్రామానికి విద్యుత్ కష్టాలు తీరాయి..

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న విద్యుత్ సమస్యకు సబ్‌స్టేషన్ నిర్మాణంలో మా గ్రామానికి విద్యుత్ కష్టాలు తీరాయి. నేడు వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటలు అందుబాటులో ఉంది. ప్రజలకు ఎంతగానో ఉపయోగంగా ఉంది.

– అలవాల వెంకటేశ్వర్లు (స్వామి), రేగులగడ్డ

నాణ్యమైన కరెంట్‌ను అందిస్తాం..

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం. విద్యుత్‌ను పొదుపుగా వాడుకోవాలి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు చర్యలు చేపడతాం.

– డి.పెదమస్తాన్ , విద్యుత్ ఏఈఈ

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై గురువారం రాత్రి గుండ్లపాడు గ్రామానికి చెందిన కాకునూరి సంజీవయ్య, అంజి, కోటేశ్వరరావు, గజవల్లి కేశయ్యలతో పాటు మరో 6 కుటుంబాలకు చెందిన వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. మండలంలోని గుండ్లపాడుకు చెందిన మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య ఆధ్వర్యంలో 10 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారికి ప్రభుత్వ విప్ పీఆర్కే కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ సీఎం జగన్ బీసీల పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కుటుంబాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ వారి కుటుంబాలలో సంతోషాలు నింపారన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు. వైఎస్ జగన్‌కు అందరం మద్దతుగా నిలచి ఆయనను ముఖ్యమంత్రిని చేసేంత వరకు సైనికుల్లా పనిచేయాలన్నారు. సీఎం జగన్ రాష్ట్రంలో 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాలను అందించారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా ముందంజలో నిలిపేందుకు ఆయన కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేతావత్ రూప్లీ బాలునాయక్, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాచర్ల మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు బూడిద శ్రీనివాసరావు, సర్పంచ్‌లు పిన్నెల్లి వెంకటరెడ్డి, తోట నారాయణ, మాజీ సర్పంచ్, పులుసు నారాయణరెడ్డి, తోట ఆంజనేయులు, గ్రామ ఉప సర్పంచ్ ఉప్పుతోళ్ళ కృష్ణ, చింతా శ్రీనివాసరావు తదితరులున్నారు.

గుండ్లపాడులో వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

వెల్దుర్తి: మండలంలోని గుండ్లపాడు గ్రామంలో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వైఎస్సార్‌సీపీకి మద్దతు పలికేలా చేయాలన్నారు. త్వరలో జరిగే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీకి నాయకులందరూ సమష్టిగా కృషి చేసి మంచి మెజార్టీని తీసుకురావాలన్నారు. సీఎం జగన్ రూ.2.60 లక్షల కోట్లను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేశారన్నారు. 124 సార్లు బటన్ నొక్కి పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారన్నారు. ఈ విషయాన్ని గడప గడపకు తీసుకెళ్లి ఆ గడపలో జరిగిన అభివృద్ధిని వారికి వివరించి వైఎస్సార్‌సీపీకి మద్దతు పలకాలని కోరాలన్నారు. అనంతరం ప్రభుత్వ విప్ పీఆర్కేని సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు చింతా శివరామయ్య, జెడ్పీటీసీ కేతావత్ రూప్లీ బాలునాయక్, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పల్లపాటి గురుబ్రహ్మం, పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్‌లు పిన్నెల్లి వెంకటరెడ్డి, తోట నారాయణ, మాజీ సర్పంచ్, పులుసు నారాయణరెడ్డి, తోట ఆంజనేయులు, గ్రామ ఉప సర్పంచ్ ఉప్పుతోళ్ళ కృష్ణ, చింతా శ్రీనివాసరావు తదితరులున్నారు.

జాగ్రత్తలతో రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు

పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు



విద్యార్థికి స్కాలర్‌షిప్ అందజేస్తున్న సీఐ ఆంజనేయులు, క్యూబ్ హైవే సంస్థ ప్రతినిధులు

పిడుగురాళ్ల: విద్యార్థి దశ నుంచే వాహనాలు నడిపే విషయంలో జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు జరుగకుండా నివారించవచ్చని ప్రతి విద్యార్థి తెలుసుకోవాలని పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు తెలిపారు. పట్టణంలోని పల్నాడు ఒయాసిస్‌లో శుక్రవారం నామ్ ఎక్స్‌ప్రెస్‌వే, క్యూబ్ హైవే, క్యూబ్ రూట్స్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పట్టణ సీఐ ఆంజనేయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూబ్ సంస్థ వారు రోడ్డు భద్రతలు పాటించడంపై పలు అవగాహన కార్యక్రమాలతో పాటు ప్రతిభ గల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ విద్యర్థుల అభివృద్ధికి తోడ్పడుతున్నారని పేర్కొన్నారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని, ఓవర్ స్పీడ్‌తో నడపవద్దని, డ్రైవింగ్ లైసెన్సు లేకుండా నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సులు పొంది వాహనాలు నడపాలని చెప్పారు. అలాగే పదవ తరగతికి చెందిన 53 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.5.30 లక్షలు స్కాలర్‌షిప్‌లు అందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించారు. ఇప్పటికే విద్యార్థుల అభివృద్ధికి పట్టణంలో మూడు ఉచిత కంప్యూటర్ సెంటర్లు నడుపుతున్నామని, 2019 నుంచి ఇప్పటి వరకు 353 స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడం జరిగిందని క్యూబ్ హైవే సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అనూజ్ మైత్రి తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ పఠాన్ రబ్బానీ ఖాన్, టీమ్ లీడర్ శ్రీనివాసరావు, నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే సిబ్బంది ప్రసాద్, నర్‌సింగ్, ముఖేష్, రాము, ప్రవీణ్, నాగార్జున, చిరంజీవి, సత్యానారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలి



నెమలిపురి జెడ్పీ పాఠశాల పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న డీఎస్పీ

రాజుపాలెం: మండలంలోని నెమలిపురి, అనుపాలెం, కొండమోడు గ్రామాల్లోని 11 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సత్తెనపల్లి డీఎస్పీ డి.గురునాథబాబు, సీఐ ఎం.రాంబాబు శుక్రవారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా గట్టి చర్యలు తీసుకుంటామని, దీనికి తగ్గట్లుగా ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఎవరైన అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఎస్ఐ షమీర్‌బాషా, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి పెట్టాలి

ముప్పాళ్ళ: ఎన్నికల నేపథ్యంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దారు పి.సింగారావు ఆదేశించారు. ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం, గోళ్ళపాడు, కుందురువారిపాలెం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో ఉన్నటువంటి వసతులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆర్.ఐ పవన్ కుమార్, వీఆర్వోలు అశోక్, దాసు ఉన్నారు.

గణపవరం ఎస్సీ కాలనీలో వైద్య శిబిరం



రాజుపాలెం: గణపవరంలోని ఎస్సీ కాలనీలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి జ్వరాల సర్వే చేపట్టారు. మురుగు కాల్వల్లో ఎబెట్‌ను చల్లించారు. 38 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా ముగ్గురుకి జ్వరాలు ఉన్నట్లు గుర్తించారు. మలేరియా, డెంగీ పరీక్షలు చేశారు. సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి చంద్రోశేఖర్ ఇంటింటా తిరిగి నీరు నిల్వ ఉన్న తొట్టులను గుర్తించి తొలగించారు. జ్వరాలు రాకుండా ముందస్తుగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సూపర్‌వైజర్ రాజేష్‌పాల్, పంచాయతీ కార్యదర్శి మహంకాళమ్మ, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ అలేఖ్య, ఏఎన్ఎంలు విమల, ధనలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వలస కూలీలకు అనారోగ్యం



వైద్య శిబిరంలో వలస కూలీలకు పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్రవంతి, పీహెచ్‌సీ సిబ్బంది

అచ్చంపేట: పెదపాలెంలో మిరప కోతలకు వచ్చిన వలస కూలీలు అతిసారా (నీళ్ల విరేచనాలు) వ్యాధితో బాధపడుతుండగా వైద్య సిబ్బంది సకాలంలో స్పందించి వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న నలుగురు పిల్లలు, ఇద్దరు పెద్దలను శుక్రవారం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు 108 అంబులెన్స్‌లో తరలించారు. మరొకరిని గుంటూరు జీజీహెచ్‌కి పంపారు. వీరంతా కర్ణాటకలోని రాయబరేలి జిల్లా అలి మండలం మాన్వి గ్రామానికి చెందినవారు. పెదపాలెంలోని ఓ రైతు పొలంలో మిర్చి కోతలు కోసేందుకు పది రోజుల క్రితం 21 కుటుంబాలు వచ్చాయి. పొలాల్లోనే గుడారులు వేసుకుని ఉంటున్న వీరు.. అక్కడే ఉన్న కుంటలు, కాల్వలు, బావుల్లో నిల్వ ఉన్న నీటిని తాగడంతో.. నీళ్ల విరేచనాలతో కూడిన వ్యాధిశోకి ఉండవచ్చని వైద్యులు భావిస్తున్నారు. డాక్టర్ స్రవంతి స్పందిస్తూ.. కలుషిత ఆహారం వల్లనా.. లేక కలుషిత నీటిని తాగడం ద్వారా సమస్య వచ్చిందా అనే విషయం తెలుసుకునేందుకు ప్రతి ఒక్కరి నుంచి బ్లడ్ శాంపిల్స్ సేకరించామన్నారు. స్థానికంగా లభ్యమయ్యే నీటి వనరుల నుంచి శాంపిల్స్ గుంటూరు రీజనల్ ల్యాబ్ సిబ్బంది సేకరించినట్లు చెప్పారు. వలస కూలీల నివాస స్థావరం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసి సహాయక చర్యలు చేపట్టామన్నారు. వీరిలో చరన్‌బసవ, ఎన్.యూసఫ్, తరున్, తేజా, మైసూర్ రాజా, రంగనాథ్‌లను సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించామన్నారు. మరొకరిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపినట్లు చెప్పారు. వ్యాధి నిరోధక మాత్రలు ఇచ్చామని, సిబ్బందిని శిబిరం వద్దనే ఉంచి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ



సత్తెనపల్లి: పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జెడ్.ఎస్. రామచంద్రరావు అన్నారు. పట్టణంలోని సుగాలి కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం శుక్రవారం పరీక్షకు అవసరమైన రైటింగ్ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులు సైతం పట్టుదలతో విద్యనభ్యశించి ఉత్తీర్ణులు కావాలన్నారు. పాఠశాల హెచ్ఎం లతా ప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాలదాసు ఆరాధనోత్సవం

కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): కుందురువారిపాలెంలోని శ్రీశెట్టిపల్లి బాలదాసు సద్గురుదేవుల 89వ ఆరాధన మహోత్సవం శుక్రవారం జరిగింది. ఆలయంలో హరేరామ నామ సంకీర్తన, ఉదయం సూర్య పూజా కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పొంగళ్లు సమర్పించి, తమ మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గురువు చిత్రపటం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు అన్నదాన చేశారు. మహిళల కోలాటం, భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మండలంలో ఈ కేవైసీ 100 శాతం పూర్తి

రెంటచింతల: ఈ కేవైసీ (ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి) చేయించుకుంటేనే రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని, ఈ నేపథ్యంలో మండలంలో 100 శాతం పూర్తి అయినట్లు మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రబీ కాలంలో 11 గ్రామాలలో మొత్తం 6,245 మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామాలలో ఇప్పటికే నూరు శాతం ఈ కేవైసీ పూర్తి చేయడం జరిగిందని వారు రైతు భరోసా, పీఎం కిసాన్, బీమా, ధాన్యం కొనుగోలు, సున్నా వడ్డీ, తదితర రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను పొందవచ్చన్నారు. ఇప్పటి వరకు 11 విడతలుగా పీఎం కిసాన్ సమ్మాన్ నిధులు వారి ఖాతాలలో జమచేయడం జరిగిందన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ, రైతు భరోసా కేంద్రం సిబ్బంది నిర్ణీత గడువులోపు 100 శాతం ఈ కేవైసీ పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ క్రాప్ బుకింగ్ కూడా ఇప్పటి వరకు 91 శాతం పూర్తి చేయడం జరిగిందని 20వ తేదీ లోపు 100 శాతం పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

ఘనంగా భావనారుషి స్వామి కల్యాణం

మాచవరం: మండల కేంద్రమైన మాచవరంలోని మిషన్ బావి సెంటర్‌లో పద్మ శాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో భద్రావతి సమేత భావనారుషి స్వామి 44వ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మంగళ స్నానం, కలశ స్థాపన, స్వామి వారి ప్రభ ఊరేగింపు , పూలు రాల్చుట, స్వామి వారి నైవేద్యం పంపిణీ కార్యక్రమాల అనంతరం స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

పవిత్ర హృదయంతో ప్రార్థించండి

రెంటచింతల: తపస్సు కాలంలో దీక్ష తీసుకున్న మాలధారులు పవిత్ర హృదయంతో యెహోవా దేవుని కుమారుడైన ఏసుక్రీస్తును ప్రార్థించాలని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి అన్నారు. శుక్రవారం కానుకమాత చర్చి ఆవరణలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించిన 14 స్థలాల కార్యక్రమంలో ఫాదర్ లూర్థుమర్రెడ్డి భక్తులకు తపస్సు కాలం విశిష్టతను వివరించారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు అంతిమ (చివరి) ఘడియలలో శిలువ వేయబడి పడిన కష్టాలను క్రైస్తవులు స్మరించుకుంటూ 40 రోజుల పాటు ఉపవాస దీక్షలను తీసుకుని నిండు హృదయంతో ఉపవాసం, ప్రార్థన, దాన ధర్మాలు చేయాలన్నారు. దీక్ష తీసుకున్న వారు పోప్ ఫ్రాన్సిస్ సూచనలు పాటిస్తూ సన్మార్గంలో నడవాలన్నారు. మాలధారులు మార్చి 31వ తేదీ వరకు 40 రోజుల పాటు ఈ తపస్సు కాల ప్రార్థనలలో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాలలో చర్చిలో సాయంత్రం నిర్వహిస్తున్న ఏసుక్రీస్తు శిలువ ధ్యానం గుర్తు చేస్తూ 14 స్థలాల పాట్లును స్మరించుకుంటూ ప్రార్థనలలో పాల్గొనాలన్నారు. ఈ పవిత్ర తపస్సుకాల ప్రార్థనలలో సహాయ గురువులు ఫాదర్ అగస్టీన్, మఠకన్యలు, చర్చి పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.